# రాజీ

## ఇచ్ఛాపురపు జగన్నాథరావు



సందేహంగానే కాల్ బెల్ బటన్ మీద చెయ్యిపెట్టి వెనక్కి తీసేశాడు ప్రకాశరావు.

అరగంట కింద అద్దంలో చూసుకున్న తన ముఖంలోని వివరాలని జ్ఞాపకం తెచ్చుకున్నాడు ... అప్పటి కన్న – పూర్వపురోజులకన్న... తాను బాగానే ఉన్నాడు అనుకున్నాడు మరోసారి.

ఆ మాట నాలుగైదు సార్లన్నాడు... యెందుకో?

దానికి అనేక కారణాలు ఉండవచ్చును–రేపటికి అవి తెలియవచ్చును.

కాని...యీ క్షణం...

కొంతకాలం కిందట – యెంతోకాలం కిందట–ఇలాగే నిలబడి యీ బటనే నొక్కేడు.

యీ ఇల్లే !

తానే !

విచిత్రంగా, యిదే టైము... మధ్యాహ్నం మూడున్నర. కాని, పరిస్థితులన్నీ ఎంత వేరైపోయాయి. ఆనాడు లోపల జరగబోయే మర్యాదలకి యెలాగ తట్టుకోవాలోననీ, చూడబోయే వాళ్ళెలాగ ఉంటారోననీ ... అనుభవంలేని మనసులో అర్థంలేని భయాలు.

యీ రోజు—

జరగబోయే 'మర్యాద'లు వేరు.

అన్నీ వేరు...

కర్చీఫ్‌తో ముఖం తుడుచుకుని, ఒక్కసారి బటన్ నొక్కేడు ప్రకాశరావు.

లోపల బెల్ శబ్దం ఆగగానే కుక్క అరిచింది.

నిమిషంలో తలుపు తెరుచుకుంది.

చిందరవందరగా ఉన్న జుత్తు సవరించుకుంటూ నిద్రకళ్ళతో తలుపుతీసి అతన్ని చూసి, అలాగే నిలబడిపోయింది రాజేశ్వరి.

"నువ్వా !"

ఆ నిద్రకళ్ళలో, విడీవిడని గొంతుకలోనూ ఉన్న భావాలు గ్రహించడం అతనికేం కష్టం కాలేదు.

అప్రయత్నంగా అడుగు వెనక్కి వేశాడు.

యెక్కడో ఒక కుక్క మరొకసారి అరిచింది.

అంతకన్నా కర్కశంగా, "అనుకున్నకంటే ముందరే–వచ్చేశావా ?" అంది రాజేశ్వరి.

అందులో క్షమాపణ ఏమీలేదు.

"అవును..." అన్నాడు. కొంచెం సేపు ప్రశ్నకి జవాబుగా వచ్చే ప్రశ్న లాగ యిద్దరూ అలాగే నిలబడ్డారు.

రాజేశ్వరి మాట్లాడకుండా లోపలికి వెళ్ళింది...అతన్ని లోపలికి రమ్మన లేదు...ఆ రోజు...సంవత్సరాల క్రిందటి ఆ రోజూ యిలాగే జరిగింది. ఆమె కూడా – యింత అందమైన మనిషి – యిలాగే రమ్మని అనకుండా తలుపు మాత్రం పక్కకి తోసి లోపలికి వెళ్ళిపోయింది. ఆ అమ్మాయికి ఆనాడు తానెవరో తెలిసి, సిగ్గు...

ఈ అమ్మాయికి, యీనాడు తానెవరో తెలిసి, సిగ్గు...

ఆహ్వానం లేకపోయినా అవసరం కొద్దీ లోపలికి అడుగుపెట్టేడు ప్రకాశరావు.

లోపల చిన్న డ్రాయింగ్‌రూమ్ లోనూ అంత తేడా లేదు – కాకపోతే, కర్టెన్లూ, కుషన్ కవర్లూ మరికొంత అరిగిపోయీ, వెలిసిపోయీ ఉన్నాయి.

అవతల నీళ్ళ చప్పుడు అవుతోంది.

షదనిమిషాలు తన ఆలోచనలు ముసురుతోంటే అలాగే తల చేతుల్లో దాచుకుని కూర్చున్నాడు ప్రకాశరావు...ఒకప్పుడు... కొద్దిరోజులు ... అందరికీ ముద్దుగా, ప్రకాశ్.

నేను ... నేను ... యెప్పుడూ ప్రకాశ్‌నే! అనుకుని అతను తనకి తాను చెప్పుకున్నాడు.

అందరూ యెక్కడికి వెళ్ళేరు ?

జ్యోతి యెక్కడ ?

యిల్లంతా అంత నిశ్శబ్దంగా ఉందేం ?

యెంతసేపలాగ గడిచిందో!

రాజేశ్వరి యింక యిటు రాదా ?... అవతలి నాలుగ్గదుల్లోనూ యెక్కడో ఉండిపోయిందా ? పెరటి తలుపు తీసి వెళ్ళిపోయిందా, తనని కాపలా మనిషిగా చేసి ?

చివరికి వచ్చి, విసురుగా సోఫాలో కూర్చుంది, రాజేశ్వరి. యీసారి తాజాగా ఉంది. నిద్ర చిహ్నాలేవీ ఆమెలో లేవు–పువ్వల్లే ఉందంటారే ... యిదే ననుకున్నాడు ప్రకాశ్.

మళ్ళీ నిశ్శబ్దం.

"కాఫీ తాగుతావా ?" అంది, ఏ భావమూ లేకుండానే, రాజేశ్వరి.

ఆమాత్రం అన్నందుకే కృతజ్ఞత చెప్పుకున్నాడు ప్రకాశ్.

"వొద్దు..."

"ఏం ? ... అలవాటు తప్పిపోయిందా ?...లేక – యింకా వెచ్చటి పానీయం కావాలా ?"

'నువ్వివ్వ గలిగే దేదీ నా కొద్దు రాజేశ్వరీ!' అందామని అనిపించిందతనికి...కాని, ఊరుకున్నాడు. కత్తి యుద్ధంలాగా, మాటల పోటీకి యిది సమయం కాదు !

"నేను తాగాలి..." అంటూ రాజేశ్వరి లేచి లోపలికి వెళ్ళి కాఫీ కప్పులు రెండు తెచ్చి ఒకటి అతని ముందు పెట్టింది.

"తాగు."

అతను కప్ తీసుకుని తాగకుండానే ఒక్క నిమిషం తరవాత కింద పెట్టేశాడు.

"ఏం ? ... విషం కలిపానని భయమా ?"

అత నేమీ అనలేదు. ఆమె మాటల కన్నా భయంకరమైన విషయం ఆమె ఆలోచనలు తప్ప మరేమీ ఉండవని మాత్రం మనస్సులో అనుకున్నాడు.

"అయినా, విషమిచ్చి చంపడం మా కలవాటు లేదులే !"

యీ సారి ఆపుకోలేకపొయ్యాడు ప్రకాశ్.

"విషాల్లో కూడా రకాలు ఉంటాయి రాజేశ్వరీ!" అన్నాడు.

రాజేశ్వరి మాట్లాడకుండా కాఫీ తాగడం ముగించింది. యీసరికి ప్రకాశ్‌కి కొంత ధైర్యం వచ్చింది.

"జ్యోతి ఏదీ ?" అన్నాడు.

"వాళ్ళంతా మా ఊరు వెళ్లేరు–పెళ్ళికి" అంది రాజేశ్వరి.

యెప్పుడొస్తారు ?"

"ఏమో!...రేపు రావచ్చు...జ్యోతికి బడిమీద మనసు మళ్ళకపోతే యెల్లుండి..."

"యెలా ఉంది జ్యోతి ?"

"దానికేం ? యీ వేళదాకా బాగానే ఉంది !" అంది పువ్వులాటి అతని ప్రశ్నని రాయిలాటి సమాధానంతో నలిపి పారేస్తూ.

"నీ ఉద్దేశం తెలుసులే రాజేశ్వరీ ! కాని..."

రాజేశ్వరి అతన్ని మాట్లాడనివ్వ లేదు.

"నాకన్నీ తెలుసులే ! తెలియకపోతే...అక్కని యెలాగ పొట్టలో పెట్టుకున్నావు ?" అంది.

ప్రకాశ్ ముఖంలో బాధా, కోపమూ కలిసి కనిపించేయి.

"ఏమిటి నువ్వంటూన్నది ?" అన్నాడు కోపాన్ని అణుచుకుని.

"ఏముంది ? ఉన్నమాటే !...అక్క ప్రాణాలు తీశావని" అంది, తీరుబాటుగా.

"నేనా ?... మీ అక్క పోయేసరికి నేను — అప్పటికి నాలుగైదు నెలల నుంచి ఆమెని చూడలేదని మరిచిపోతున్నావా ?" అన్నాడు ప్రకాశ్ ఆశ్చర్యంగా.

"మరిచిపోలేదు ... కాని, నీలో ఆ శక్తి ఉంది...అక్క నీతో ఉన్న నాలుగేళ్ళలోనూ ఆమెని ఎలాగ చిత్రహింస చేసేవో నాకు తెలీదా ?... చివరికి — జెయిల్లో పడ్డావు. ఆ అవమానం చాలదూ ?...అక్క—"

"షటప్ !" అని కొరడాదెబ్బ లాటి గొంతుకతో అరిచాడు ప్రకాశ్. రాజేశ్వరి కొంచెం భయంగా అతని

వైపు చూసి, ఏదో అనబోయి ఊరు కుంది.

"కేవలం మీ అక్కని చంపడానికే జెయిలుకి వెళ్ళే నంటావు !...పాపం ! అప్పుడే విచ్చిన పువ్వులాటి పవిత్రత ఆవిడ...ఏం ?...చూడు రాజేశ్వరీ ! నేనేం పసిపాపని కాదు ...మీ అక్క– ఆ మహాపతివ్రత – జెయిల్లో ఒక్కసారి కూడా నన్ను చూడలేదని, మరిచి పోకు..."

కొంచెం తేరుకుని, రాజేశ్వరి "అక్కకి జెయిళ్ళ వెంట తిరిగే అల వాటులేదు" అంది.

"అవునులే ... ఉన్నదల్లా—" అని ఆగిపోయాడు. తనకి కావలసినది జ్యోతి...మాటకి మాట అంటించడం కాదు—

"ఏమిటి ?" అంది రాజేశ్వరి.

"ఏమీ లేదులే – నీతో వాదించాలని రాలేదు..."

"అలాగా ? మరి...?"

"జ్యోతికోసం వచ్చాను."

నిమిషమో, గంటలాటి నిమిషాలో నిశ్శబ్దం ఆ ఇద్దరినీ ఆవరించింది.

"ఏం ?...దాన్ని బ్రతికి బాగుపడ నివ్వవా ?"

ప్రకాశ్ కొంచెం ఆగి, ఆవేశాన్ని దిగమింగుకుని, "నీకు అర్ధమవాలి రాజేశ్వరీ ! ... నా కీరోజు మిగిలింది జ్యోతి ఒక్కటే ... ఉద్యోగం పోయింది ... పరువు పోయింది ... సంసారం పోయింది...ఉన్నది జ్యోతి ఒక్కటే !" అన్నాడు.

"ఏమీ లేకుండా దాన్ని ఎలాగ పెంచుతావు ?"

"నా ప్రాణం అయినా యిచ్చి..."

రాజేశ్వరి నిర్జీవంగా నవ్వింది.

"దాన్ని పెంచే శక్తీ లేదు నీకు— అర్హతా లేదు...అక్క పోనే పోయింది. జ్యోతినైనా సుఖపడనీ ... మమ్మల్నం దర్నీ మరిచిపో...జ్యోతి మరీ చిన్నది. నీకేం అపకారం చేసింది ? ... " అంది రాజేశ్వరి అలిసిపోయినట్టు మాట్లాడుతూ.

హఠాత్తుగా మారిపోయిన ఆమె కంఠస్వరం అతన్ని కొంచెం ఆశ్చర్య పరిచినా, ఆ మాటలలోని ధ్వని ముల్లు లాగ అతనికి గుచ్చుకుంది. అతని కనిపించింది, రాళ్ళు విసిరితే శబ్దం ఉంటుంది కాని ముల్లుగుచ్చేటప్పుడు కాదని.

"కాని, జ్యోతి నా దగ్గర సుఖపడ దని ఎందుకనుకోవాలి ?" అన్నాడు ప్రకాశ్.

"తెలీదా ప్రకాశరావ్ ?... ఒకరిని సుఖపెట్టగలిగే మనిషివి కాదు నువ్వు... ఈ మాట నిన్ను బాధించడానికి మాత్రమే అనడంలేదులే ... నిన్ను నువ్వు సుఖపెట్టుకోలేవని నాకు తెలు సును ... మా ఇంట్లో అది అమ్మని మరిచిపోయి, ఆడుకుంటూ హాయిగా ఉంది. దాన్నెందుకు మళ్ళీ బాధపెడ తావు ?" అంది రాజేశ్వరి.

"కాని ... నీ కొక్క నిజం తెలీదా రాజేశ్వరీ ?"

"ఏమిటది ?"

"కమలని నేను నిజంగానే ప్రేమించాను ... నువ్వు నమ్మక పోవచ్చును..."

"నేను నమ్మడం అసంభవం..."

"కమల కూడా ఆ మాట నమ్మ లేదులే ! ... కాని, ఎవరి గుండెలలో ఏముందో ఎవరికి తెలుసును ?... నీతో ఈ రోజు అబద్ధం చెప్పాల్సిన అవ సరం నాకు లేదు ... కాని, ఈ మాట మాత్రం నిజం..."

రాజేశ్వరి పొడిగా నవ్వింది.

సంవత్సరం క్రిందట యింకా చక్కగా ఉండేది రాజేశ్వరి. బహుశా ఈ సంవత్సరంలో జరిగినవన్నీ ఆమెని చాలా బాధించి ఉంటాయి.

ఈసారి వెక్కిరిస్తోన్న ఆ నవ్వు అతన్ని బాధపెట్టలేదు.

"ఏమంటావు రాజేశ్వరీ ?"

"అనడాని కేముంది ? అమ్మ, నాన్న సరేనంటే నే ననేది ఏముంది ?"

"ఈ యింటిలో నీ మాటకి తిరుగు లేదని నాకు తెలుసును..."

"అదొక అపోహ... కాఫీ నిజంగానే తాగలేదే నువ్వు ? విషమేమీ లేదని చెప్పేనుగా !"

ప్రకాశ్ లేచి నిలబడి, "సరే... రేపు సాయంత్రం వస్తాను..." అన్నాడు.

"అలాగే చెయ్యి..." అంది తానూ నిలబడుతూ రాజేశ్వరి.

అతను గుమ్మం దాటుతూంటే, "ఎక్కడ ఉంటున్నావు ?" అంది.

అతను హోటలు పేరు చెప్పి గది నెంబరు కూడా చెప్పేడు.

రాజేశ్వరి కొంచెం ఆశ్చర్యంగా చూసి, "అయితే ఫరవాలేదులే ! ... లేకపోతే ఇక్కడే ఉండమందామని అనుకున్నాను" అంది.

"నీతో ఒంటరిగానా ?" అన్నాడు ప్రకాశ్.

"భయంలేదులే ! .........నీకూ, నాకూను. అయినా, పచ్చిమంచినీరైనా తాగని అతిథిని భరించడం కష్టం..." అంది రాజేశ్వరి.

"అవును."

అతను గుమ్మం దాటుతోంటే లోపలికి వస్తూ ఒక మనిషి కనిపించేడు. పెద్ద జుత్తూ, మెడలో బిళ్ళా, అంతా హిప్పీలాగ ఉన్నాడు. అతనూ, ప్రకాశ్ పరస్పరం అభిమానం ఏమీలేని చూపులు ఒక క్షణం చూసుకున్నాక అతను రాజేశ్వరి యింటిలోకీ, ప్రకాశ్ రోడ్ మీదకీ, వెళ్ళిపోయారు.

ప్రకాశ్ కొంతదూరం నడిచి టాక్సీలో హోటలుకి వెళ్ళేడు. తాను వెళ్ళిన పని విజయవంతం కాలేదని అతనికి తెలుసును. కాని, వెళ్ళేముందర ఉన్న అనుమానాలే ఇప్పుడూ ఉన్నాయి. తనకీ, జ్యోతికీ మధ్య రాజేశ్వరి పెద్ద గోడలాగ నిలబడి ఉంది. ఆమె కాదని అన్నా, ఆ యింటిలో ఆమె మాటకి తిరుగులేదు అని తనకి తెలుసును.

ఆరో అంతస్థులో ఉన్న ఆ గది జెయిల్లాగ ఉంది ... ఎయిర్‌కండిషన్‌తో, బయటి గాలి కూడా లోపలకు రాదు ... తొమ్మిది మాసాల జెయిలు తరవాత తలుపులువేసిన ప్రతి గదీ అతనికి జెయిలునే జ్ఞాపకం తెస్తోంది.

వెళ్ళి స్నానంచేశాడు. అది ఆ రోజు మూడోసారి.


షవర్‌లోనించి వస్తున్న శుభ్రమైన నీరతనికి చాలా ఆనందాన్ని ఇచ్చింది. తొమ్మిది నెలలలోనూ అతను మరీ వాచిపోయినది శుభ్రమైన స్నానానికే.

బట్టలు వేసుకుని వచ్చి మంచంమీద వాలి ఒక పుస్తకం తీసుకుని చదివే ప్రయత్నం చేశాడు. కాని, పంక్తులమీద మనసు నిలవడంలేదు... కమలకన్నా, జ్యోతికన్నా, రాజేశ్వరి అతని ఆలోచనల్ని ఎక్కువగా ఆక్రమిస్తోంది.

ఉదయం అతనికి అనిపించింది, ఏదో ఒక సందర్భంలో రాజేశ్వరి తనని "జెయిలు కెళ్ళిన మనిషి" అని, అవే మాటలలో అంటుందని.

కాని, అవే మాటలు రాజేశ్వరి అనలేదు ... అంతకన్నా క్రూరమైన మాటలన్నా, అవే మాటలు ఆమె అనలేదు.

అన్నా, నిజంకాదని కాదు ... కాని ...



తాను జెయిలుకి అందరిలాగా పోలేదు.

చేసిన నేరం చెయ్యలేదని అంటారు...ముద్దాయిలూ, ఖైదీలూ... కాని, చెయ్యని నేరం చేసేనని చెప్పి వెళ్ళేవారు అరుదు, తనలాగ.

ఏమిటో అదంతా ఆలోచించాలని లేదు.

లేచి, రెండుసార్లు ఇటూ అటూ పచార్లు చేసి, కర్టెన్‌లు తొలగించాడు.

ఆకాశం నిండా నల్లటి మేఘాలు.

చిన్న తుంపరలు పడుతున్నాయి.

ప్రకాశ్ అలాగే చూస్తూ నిలబడ్డాడు. ఈ యెత్తునించి ఆ చినుకులు చెట్ల శిఖరాలమీదా, ఇళ్ళ కప్పులమీదా పడుతూ, విచిత్రంగా కనిపిస్తున్నాయి.

తొందరగా వర్షం వచ్చేసింది.

రోడ్డుమీద ప్రజలు వడివడిగా రక్షణ కోసం పరుగులు పెడుతున్నారు. స్కూటర్లమీద పోతోన్నవాళ్ళు రైన్ కోట్లు తీసి వేసుకుంటున్నారు.

వర్షం క్రమంగా పెద్దదవుతోంది.

ఆనాటిలాగే, ఉరుములూ, మెరుపులూ. ఆనాటిలాగే, ఒక్కసారి చీకటి.

ఆనాడు తాను, షా, కారులో వస్తున్నారు. నగరం పొలిమేరలలోకి వచ్చేసరికి కారు ముందు రెండడుగులకన్న కనిపించడంలేదు.

చాలా స్పీడుగా కారుని నడుపుతున్నాడు షా.

"కొంచెం తగ్గు, షా !" అన్నాడు ప్రకాశ్.

"ఏం ?" అన్నాడు నవ్వుతూ షా.

"టౌనులోకి వెడుతున్నాం... జనం ఉంటారు". నవ్వేడు షా.

"నా పేరు కుందన్ !" అన్నాడు, స్పీడు తగ్గించకుండానే.

"సరే. తగ్గించు కుందన్ " అన్నాడు తాను. తామిద్దరూ సరిసమానంగానే తాగినా, షామీద ప్రాబల్యం యెక్కువగా ఉందల్లే ఉంది.

"భయపడకు ... కావాలంటే మరో రౌండు వేసుకో !" అన్నాడు కుందన్.

యింక ఏమన్నా అంటే షా మరి కొంచెం వేగంగా పోతాడని తాను ఊరుకున్నాడు.

ఒక స్కూటరు అర సెకండు వాసితో

తప్పించుకుని, వాహకుడు బ్రతికి పోయాడు.

షా సంతృప్తిగా నవ్వేడు, ఆగి పోయి తమవైపు గాభరాగా చూస్తూన్న వాహకుణ్ణి చూసి.

ఒక టర్నింగ్‌లో పేవ్‌మెంట్ యెక్కి దిగింది కారు.

కాని కుందన్ తగ్గలేదు.

ప్రకాశ్‌లో డ్రింకుల బలం తగ్గి భయం ఆవరించింది.

ఏదో ఒకటి చెయ్యాలనిపించింది.

ఏంచెయ్యాలన్న ఆలోచన ఎటూ తెగేలోపునే, జరగవలసింది జరిగి పోయింది.

కారు వెళ్ళి ఒక పోలీస్ మోటారు సైకిలుకి గుద్దింది. బ్రేకు పడక, పక్కన ఉన్న చెట్టుకి గుద్దుకుని, ఆగి పోయింది.

అదే క్షణంలో ఒక్క మెరుపు మెరిసింది.

షా వర్షంలోకి దిగేడు.

"బ్రేకు పడలేదు...బ్రేకు పడలేదు" అంటూ వర్షంలో తడుస్తూ నిలబడి పోయాడు.

ప్రకాశ్ కూర్చున్న వేపు డోరు చెట్టుకి తగులుకుని రాలేదు. అతను డ్రైవరు సీటువేపు జరిగి ఒక్క క్షణం స్టీరింగ్ వీల్‌మీద తల ఆన్చుకున్నాడు ... తర వాత తెలిసింది – తన తలకి దెబ్బ తగిలిందని.

కళ్ళు తెరిచేసరికి ఒక పోలీసు తనని లేపుతున్నాడు.

ఏంబులెన్స్.

పోలీస్.

హాస్పిటల్.

పోలీస్.

"నా గౌరవం కాపాడు......" అంటూ, షా.

"నువ్వే డ్రైవ్‌చేస్తూ ఏక్సిడెంట్ చేశావని రాసుకున్నారు...ప్రకాశ్ !... నేను నిజం చెప్పలేదు ... నా గౌరవం కాపాడు ... నీ జీవితానికి నేను భరోసా..."

అంటూ షా.

"కారు నడిపేటప్పటికి తాగి ఉన్నావు..."

పోలీస్.

"యీ రెండు మాత్రలూ వేసు కుని, యింజక్షన్ తీసుకుని, నిద్రపో."

డాక్టర్, నర్స్.

స్టేట్‌మెంటు.

"బ్రదర్ ! నీ మేలు మరవను... నా జీవితాన్నే రక్షించేవు ... నీ పూచీ నాది ... బ్రదర్ ! నువ్వు నా పార్ట్నర్‌వి !" అంటూ ఏడుస్తోన్న షా.

"చివరికి ... జెయిల్లో పడ్డారన్న మాట !" అంటూ కమల.

యెందుకో ఆమెకంత కసి !

"జ్యోతి ఏదీ !" ఆశగా తాను.

"దాన్ని జెయిలుకి తేవాలా ?" నిరాశగా కమల.

"ప్రాసిక్యూషన్ కేసు చాలా బలంగా ఉంది ... పోలీసుకి రెండు ఫ్రాక్చర్లు, మీరు త్రాగి ఉన్నారు. గిల్టీ ప్లీ ఉత్తమం" లాయరు.

"మళ్ళీ నేనూ రాను ... యీవేళ శేఖర్ సాయంతో ఎలాగో వచ్చేను..." కమల.

"తాగి, కారు నడపడం, తీవ్రంగా శిక్షించాల్సిన నేరం ... నేరాన్ని అంగీ కరించినందుకూ, ముద్దాయి వయసూ, సంఘంలో అతని స్థానం, యీ శిక్షతో అతని ఉద్యోగంకూడా పోతుందనీ మనసులో ఉంచుకునీ, కోర్టు అతనికి పదినెలల కారాగారశిక్ష విధిస్తోంది," అంది కోర్టు.

"అపీల్ చేస్తాను" అన్నాడు షా.

"వద్దు..."

"ఏం ?"

విచిత్రమైన వైరాగ్యం తనని ఆవరించింది.

"యెందుకని ? కోర్టుముందు నేను నా నేరాన్ని అంగీకరించేను–మరో ఆరు నెలలు జెయిల్లాంటి ప్రపంచంలో ముఖం దాచుకోవడంకన్న, ఆ శిక్ష అయిపోయిందని అనిపించుకోవడం ఉత్తమం," అంటూ, తాను మొండిపట్టు పట్టేడు.

"పాగల్ !" అని, ఊరుకున్నాడు షా.

జెయిలు.

తాగుడు లేదు.

పేకాట లేదు.

క్లబ్బులు లేవు.

ఖరీదైన తిండి లేదు.

ఒంటి బరువు తగ్గింది.

ఆరోగ్యం బాగుపడింది.

చా లావిషయాలమీద వ్యామోహం తగ్గింది.

ఆరునెలలు గడిచాక, షా ఒకనాడు వచ్చి, "కమల...పోయింది" అన్నాడు.

"ఎక్కడికి ?" అని మూర్ఖంగా అడిగేడు తాను...

షా తల వంచుకున్నా.డు

స్కూటర్‌మీద ... ఎవరితోనో వెడుతూ, ఏక్సిడెంట్‌లో పోయింది, లారీకి ఢీకొని...

పోస్ట్‌మార్టమ్.

ఆమెకి నాలుగో నెల...

ఆ మాటా షాయే చెప్పేడు ... తన బాధ తగ్గించడానికిలాగ. కాని, ఆ క్షణంలో ఆమె దురదృష్టానికి తానే కారకుడినని అనుకొంటూన్న ప్రకాశ్‌కి ఆ విషయం బాధని కలుగజేసింది.

కమల తన భార్య.

సిగ్గుగా, భయంగా, ఆశగా... తన జీవితంలోకి నడిచివచ్చి, తన మెడలో హారంవేసి తినతో జీవనమార్గంలో

అడుగులు వేద్దామనుకున్న అర్ధాంగి. తనకి జ్యోతిని ఇచ్చిన భార్య.

ఆ నెలరోజుల్లో మరో నాలుగు కిలోల బరువు తగ్గాడు.

హాస్పిటల్‌కి.

తనకేం ? ఒళ్ళు బాగానే ఉంది.

బాగులేనిదల్లా, తన జీవితమే.

ఈ జెయిలునించి, మరొక జెయిల్లోకి.

ఎందుకంటే, కమలని తాను గాఢంగా ప్రేమించేడు. ఆమెని చూసి, కావాలని, ముచ్చటపడి, పెళ్ళిచేసుకున్నాడు.

కొన్నాళ్ళు తామిద్దరూ స్వర్గంలో లాగ ఉన్నారు.

కాని...రాగం మారిపోయింది.

అంతా, అపోహ. మీనాక్షితో మొదలు.

తనకీ మీనాక్షికీ మధ్య వాచుకో వలసింది ఏమీలేదు - ఒక స్నేహితు రాలిగా, ఆమెని అభిమానించేడు - అంతే.

అప్పటికి జ్యోతి మరో రెండు నెలల్లో పుడుతుంది.

ఇంట్లో ఆమె తల్లిదండ్రులు.

అప్పుడూ, అప్పుడూ వస్తూ పోతూ...రాజేశ్వరి.

ఇంట్లో అంతగా ఉండాలని ఉండేది కాదు ... ఫ్రెండ్స్‌తో తిరిగేవాడు. ఈ వ్యసనం...తాగుడు-ఆ రోజుల్లోనే, సరదాగా అలవాటు చేసుకున్నాడు.

ప్రతీ రోజూ కమలతో ఒక్క నిమిషమైనా ఉంటూనే ఉండేవాడు ... ఆ రోజు తప్ప.

ఆ రోజు షాతో పరిచయం అయింది. ఎందుకో, మొదటిసారే, చిరకాల మిత్రుల్లాగ పరస్పరం ఆనందంతో కాలం గడిచిపోయింది.

ఇంటికి వచ్చేసరికి సగంరాత్రి దాటిపోయింది.



రెండుసార్లు తలుపు తట్టేక రాజేశ్వరి తలుపు తీసింది.

అందరూ నిద్రపోతున్నారు.

ఆ రాత్రి వేడిగా ఉంది; ఫేన్ల శబ్దం స్పష్టంగా వినిపిస్తోంది. మామగారు కాబోలు, గురక పెడుతున్నారు.

తాను మేడమీది గదిలోకి వెళ్ళి బట్టలు మార్చుకుని పడుకుందామని ప్రయత్నం చేశాడు.

నిద్ర రాలేదు.

ఆరుబయట నిలబడ్డాడు.

ప్రకృతి అంతా నిద్రపోతోంది.

తనకి నిద్ర రావడంలేదు.

"మంచినీళ్ళు కావాలా ?" అని అడిగింది రాజేశ్వరి.

"వొద్దులే - గదిలో పెట్టే" అని, ఆమె శ్రమకి బాధపడి, "నీ నిద్రపాడు చేశానా ?" అన్నాడు.

"నామాటకేంగాని, అక్క నిద్ర పాడుచేశావు" అంది రాజేశ్వరి, వెన్నెట్లోకి వస్తూ.

"ఏం ? ఎలా ఉంది కమల," అన్నాడు ఆత్రంగా, ప్రకాశ్.

"నీకోసం చూసి చూసి, నిద్రరాక పోతే రెండు మాత్రలిచ్చేను... పడుకుంది" అంది రాజేశ్వరి తన పక్క నిలబడుతూ.

"సారీ! అనుకోకుండా ఆలస్యం అయింది" అన్నాడు తాను.

"అవును... మీనాక్షితోనేనా ?" అంది రాజేశ్వరి.

కొంచెం ఆశ్చర్యంగా, "కాదు" అన్నాడు తాను.

"నువ్వు అబద్ధం ఆడుతున్నావు" అంది రాజేశ్వరి. కోపంగా అంటే బాగుండును... కాని, పొడిగా అంది. అదే స్వరంతో, "డ్రింక్స్ కూడా తగిలాయి" అంది.

"అవును" అన్నాడు తాను.

"కనీసం నిజం చెప్పేవు..." అంది రాజేశ్వరి, రెండు మాటల్నీ నిజం చేస్తూ. తాగిన నీటి ప్రాబల్యం చాలాసేపట్నుంచి తగ్గుతోంది. వెన్నెట్లో రాజేశ్వరి తియ్యగా కనిపిస్తోంది. ఆమె ఆడే మాటలూ, వాటిలోని భావాలూ మాత్రం గుచ్చుకుంటున్నాయి, పువ్వుచుట్టూ ముళ్లలాగ.

"నువ్వనుకుంటూన్నది పొరపాటు..."

"నాకంతా తెలుసును... అక్క చెప్పింది."

"ఏమని ?"

"నీ విషయమంతా... నీకే తెలుసుగా ?... ఎందుకలాగ అక్కని చిత్రహింస చేస్తావు ?

అనుకోకుండా, నవ్వొచ్చింది.

తెలిసీ తెలియని ఈ అమ్మాయికి ఎలాగ చెప్పడం ? ఏం అర్థం అవుతుంది ?

"పాడు ఆలోచనలు పెట్టుకోకు... వెళ్లి... నిద్రపో."

రెండు కళ్లూ తనకళ్లవేపు తిప్పి తేరి చూసింది రాజేశ్వరి. పెద్ద కళ్లు ఆమెవి ... కమలలాగ కాదు.

"ఏం ? భయంగా ఉందా ?"

ప్రకాశ్ బాధపడ్డాడు. ఆ మాటకి ఆ ఏకాంతపు ఇద్దరిమధ్య చాలా అర్థాలు... రాజేశ్వరి...

"పద... రేపు మాట్లాడుకుందాం.."

ఆమె కదల్లేదు. భుజం పట్టుకొని తీసికెళదామని అనిపించలేదు.

"గుడ్‌నైట్ !"

అతనే వెళ్లి పడుకున్నాడు.

మరొక పావుగంట తరవాత ఆమె అడుగుల సవ్వడి వినిపించింది. తీసి ఉంచిన గుమ్మంలో నిలబడింది రాజేశ్వరి ఆమె వెనకాల వెన్నెల తెరలు.

అప్రయత్నంగా తాను లేచి కూర్చున్నాడు, మంచంమీద.

"ఏమిటి, రాజేశ్వరీ ?" అన్నాడు, పూడిపోయిన గొంతుకతో... ఆ క్షణాల నిండా ప్రమాదం...

"ఏంలేదు... మంచినీళ్లు తాగి పడుకో!" అని, రాజేశ్వరి కిందికి వెళ్లిపోయింది. మెట్లు దిగుతోన్న ఆమె అడుగుల చప్పుడు కూడా అతనికి మరుపురాదు.

జెయిల్ హాస్పిటల్లో పడుకుని ఆ రోజులు తలుచుకుంటే, రానున్న నరకానికి ఆ రాత్రి... ఆ నిమిషాలు నాంది, అనిపించింది.

ఆ మర్నాటి నించీ కమల తెలియని దారుల్లోనూ, తెలిసిన వాటిలోనూ, తనకి దూరం అయిపోసాగింది.

తాను ప్రయత్నించలేదనికాదు.

చాలా ప్రయత్నించేడు.

కాని, కమల అనుమానాలనీ భయాలనీ, రాజేశ్వరి నిజంచేసింది.

తన నిజం వ్యక్తంచేసి రుజువు చేసే ప్రయత్నాలన్నీ విఫలమౌతూ వచ్చేయి ... విఫలమైనకొద్దీ తనకి బాధ, కొంత కోపం, కలిగేయి.

ఒకసారి, ఆ రోజుల్లో, అనిపించింది ...పది అబద్ధాలని రుజువుచెయ్యొచ్చు గాని, ఒక నిజాన్ని రుజువుచెయ్యడం కష్టం, అని.

క్రమంగా మీనాక్షి దగ్గర అయింది.

అవసరం ఉంటే ప్రాణం పెట్టే మిత్రుడయాడు షా... 'నా పేరు కుందన్' అంటూ.

కమల జ్యోతిని తననించి వీలైనంత దూరంగా ఉంచేక, జీవితంలో మరొక దశ ఆరంభం అయింది.

స్వర్గంలాగ ఉండే ఆ ఇల్లు పూర్తిగా నరకం అయింది.

రాజేశ్వరి ఉండీ ఉండీ వస్తూనే ఉండేది.

రోజుల తరబడి మాట్లాడకుండా ఉండి, ఒక్కసారిగా మరీ దగ్గరికి వచ్చి, ఒక గాయంచేసి, మళ్లీ దూరంగా వెళ్లిపోయేది.

ఒకసారి...

వర్షంలో తడిసి వచ్చాడు... స్కూటర్ పోర్టికోలో పెట్టి తలుపు కొట్టేసరికి రాజేశ్వరి తలుపు తీసింది.

"ఎప్పుడొచ్చావు?" అన్నాడు.

"మధ్యాహ్నం..."

కమలకోసం అటూ ఇటూ చూశాడు ... కనిపించలేదు.

"కమల ఏదీ?"

"డాక్టర్ దగ్గరికి వెళ్లింది."

"ఎందుకని?"

"నీకే తెలియకపోతే నాకేమిటి తెలుస్తుంది?" అంది రాజేశ్వరి.

"ఏ డాక్టరు?"

"నాకూ తెలీదు..."

"జ్యోతి?"

"నిద్రపోతోంది."

అతనట్లు వెళ్లబోతే, పట్టుకుని ఆపి, "అది అరగంటనించి ఏడ్చి ఏడ్చి నిద్రపోయింది... దయచేసి లేపకు" అంది.

'దయచేసి'!

తనకీ తన ఇంటికీ ఎంత దూరం అయిపోయింది!

తన గదికి వెళ్లి పొడిబట్టలు కట్టుకుని, ఏదో పుస్తకం తీసి చదవబోయాడు ప్రకాశ్. కాని అటు కమలమీదా, ఇటు రాజేశ్వరిమీదా కోపం అతన్ని లోలోపలే తినేస్తోంది.

మెట్లకింద నిలబడి, "కాఫీ కావాలా?" అని కేకపెట్టింది రాజేశ్వరి.

"వద్దు" అని అరిచాడు తాను.

ఆ రోజు షా ఎక్కడికో వెళ్లేడు. లేకపోతే, ఇంత వర్షంలోనూ తాను వెళ్లిపోయి ఉండేవాడు.

మరో అయిదు నిమిషాల తరవాత రాజేశ్వరి కాఫీ తేనే తెచ్చింది.

"వద్దన్నానుగా!"

"తడిసి వచ్చాక, కాఫీ అయినా ఇవ్వకపోతే, తోచలేదు... అయినా, ఎవరిమీద కోపం?" అంది రాజేశ్వరి కాఫీ తన కందించబోయి.

"కోపంలేదు, తాపంలేదు... కాఫీ వద్దు... నా కోసం నువ్వేమీ శ్రమ తీసుకోకు!'' అన్నాడు. ఎక్కడో పిడుగు పడింది.

టేబిల్‌మీద కాఫీ పెట్టి, జ్యోతి ఏడుపు విని, కిందికి పరుగెట్టింది రాజేశ్వరి.

అయిదు నిమిషాల తరవాత కూడా జ్యోతి ఏడుపు తగ్గలేదు.

ప్రకాశ్ దిగి వెళ్లి, వద్దంటున్నా, బలవంతాన రాజేశ్వరి చేతుల్లోనించి జ్యోతిని తీసుకున్నాడు.

ఒక్కసారి ఊరుకుంది జ్యోతి.

"నువ్వంటే జ్యోతికి భయమే" అంది రాజేశ్వరి, మళ్లీ జ్యోతి కోసం చేతులు జాపుతూ.


ఆమె గాజు చిట్లి చేతిమీద రక్తం వస్తూంది. ఇందాకా, జ్యోతిని తీసుకునేటప్పుడు తన చెయ్యి తగిలి ఉంటుంది.

అది చూసి, "సారీ రాజేశ్వరీ! పోయి మందు రాసుకో" అన్నాడు తాను.

"ఈ చిన్న గాయాలకేంలే" అంది రాజేశ్వరి, జ్యోతిని తీసుకుంటూ.

ఆ ఇంట్లో ఒక్క క్షణం ఉండాలనిపించక, స్కూటర్‌మీద బయలుదేరి వెళ్లిపోయాడు ప్రకాశ్.

ఇలాగే చివుకుతూ చివుకుతూ వచ్చింది తన సాంసారిక జీవితం.



ఆ నాడు హాస్పిటల్లో ఆలోచనలన్నీ ఈ నాడీ హోటల్ గదిలో వాస్తున్నాయి.

కమల లేదు.

జ్యోతి కనిపించలేదు.

రాజేశ్వరి మారలేదు.

ఇలాటి సమయంలో అనుసయం ఇచ్చేది డ్రింకుకాని, మళ్లీ దాన్ని స్పృశించే ఉద్దేశంలేదు. ఇక్కడికి వచ్చేటప్పుడు షా పెట్టెలో ఒక బాటిల్ పెట్టేడు. కాని, దాన్ని తెరిచే ఉద్దేశం లేదు.

బాటిల్ టేబిల్‌మీద ఉంది. అది అలాగే ఉంటుంది.

టెలిఫోన్...

షా.

"ఏమయింది ! జ్యోతి...''

జరిగినదంతా చెప్పేడు క్లుప్తంగా. చెప్పడానికంతగా ఏమీలేదు.

"సారీ బ్రదర్...''

"డోంట్ మైండ్... రేపు–"

"అవును... రేపు– నువ్వు నా కంపెనీలో డైరెక్టరు వని చెప్పు... జీతం అడిగితే రెండు వేలని చెప్పు... దానితో కిందకి దిగుతారు..."

"అబద్ధాలేం ఆడక్కరలేదు షా!" అన్నాడు ప్రకాశ్.

"అబద్ధం అని ఎవరన్నారు? ఈ రోజు బోర్డు మీటింగ్‌లో ఏకగ్రీవంగా ఆమోదించిన తీర్మానాన్ని నువ్వెలాగి కాదంటావు?"

పెద్దనిట్టూర్పు విడిచాడు ప్రకాశ్. నిన్న తన జేబులో పెట్టిన రెండు వేల రూపాయిల పర్స్‌తో తమ బాకీలు చెల్లు కాలేదన్న మాట.

"ఎడ్వాన్సు కూడా ఇచ్చానుగదా?" అని నవ్వుతూ ఫోన్ పెట్టేశాడు షా.

గదిలో చలిగా ఉంది.

మనస్సులో ఒక మూల హాయిగా ఉంది.

పడుకుని, రెండు చేతులూ తలకింద పెట్టుకుని ఆలోచిస్తూ కళ్లు మూసుకుని ఉన్నాడు ప్రకాశ్.

ఎవరో కాల్‌బెల్ నొక్కుతున్నారు.

"కమిన్!"

నిమిషం ఏమీ జరగలేదు.

"కమిన్!" అన్నాడు మళ్లీ–లేవడం ఇష్టంలేక.

తలుపుతోసుకుని, లోపలికి వచ్చింది రాజేశ్వరి.

"నువ్వా!" అన్నాడు.

తడిసి తడిసి ఉంది రాజేశ్వరి.

అతను లేచి కూర్చుని మౌనంగా నిలబడ్డ రాజేశ్వరిని చూసి, "ఏమయింది? ఎందుకిలాగ తడిసి వచ్చావు?" అన్నాడు.

రాజేశ్వరి మాట్లాడలేదు.

ప్రకాశ్ రెండు టవల్స్ తీసి ఇచ్చి, "బాత్‌రూమ్‌లోకి వెళ్లి తుడుచుకో..." అన్నాడు.

ఒక తువ్వాలు మాత్రం కప్పుకుని, "బాధలేదులే— నిన్నొక ప్రశ్న అడగాలని అనిపించింది — వచ్చేశాను" అంది.

"సరే, కూర్చో......కాని, తల తుడుచుకుంటే మంచిది." అన్నాడు ప్రకాశ్.

"అంతగా ఏం తడవలేదులే– టాక్సీలోనే వొచ్చాను..." అని రాజేశ్వరి గది చుట్టూ చూసి," చాలా బాగుంది. అరే! ఆ బాటిల్ అలాగ వొదిలేశావేం? ...చూస్తూనే కూర్చున్నావా?" అంది.

"అవును... అదేనా, నువ్వడిగే ప్రశ్న?" అన్నాడు ప్రకాశ్. ఈమె అలాగ నిలబడి తనవైపు చూస్తూ ఈ మాటలాడుతోంటే ఏమిటో విచిత్రంగా ఉంది.

క్షణమాత్రం అతనికి కమల జ్ఞాపకం వొచ్చింది.

కమలకీ, రాజేశ్వరికీ అంతగా తెలిసే పోలికలేమీలేవు.

"కాదులే... నిజానికి ఆ ప్రశ్న ఎలాగ వెయ్యాలో సరిగ్గా తెలియడం లేదు."

"సరే......... కూర్చో! తీరిగ్గా ఆలోచించు!"

వర్షం ఉధృతంగా ఉంది, బయట.

ఆమె కూర్చుని, కొంచెంసేపు గాజు తలుపులలోనించి వర్షాన్ని గమనిరిచింది.

ప్రకాశ్ రూమ్ సర్వీస్‌కి ఫోన్‌చేసి రెండు కాఫీలు తెప్పించేడు.

కప్‌లో కాఫీపోసి రాజేశ్వరికి ఇవ్వబోతోంటే అతనికి సందేహం వొచ్చింది ... రాజేశ్వరి తీసుకుంటుందా, అని సాయంత్రం అనుకున్న మాటలన్నీ జ్ఞాపకంవొచ్చేయి.

థేంక్స్ చెప్పి కాఫీ తీసుకుంది రాజేశ్వరి.

"నువ్వెళ్లగానే ఏం చేశానో తెలుసా?"

ఉపోద్ఘాతం లేకుండా అడిగింది.

అతను తల ఊపేడు.

"నాన్నకి టెలిగ్రాం పంపేను..."

ప్రకాశ్ ఏమీ అనలేదు.

"నీకెదురయ్యాడే, హిప్పీ... వాడి చేత..."

"అలాగా!"అన్నాడు ప్రకాశ్, చిరునవ్వుతో.

"ఏమనో తెలుసా?"

"నాకెలాగ తెలుస్తుంది?"

ఆమె కాఫీ సిప్ చేస్తూ ఉండిపోయింది."

"ప్రకాశ్!" అంది, విచిత్రంగా. ఈమె రాజేశ్వరి కాదా, అనిపించేంత విచిత్రంగా.

"ఏమిటి రాజేశ్వరీ?" అన్నాడు.

"మనం ఎప్పుడూ– కలిసి నవ్వుకోలేదు కాదూ?" అంది రాజేశ్వరి... ఆమె కళ్లలో చిరునవ్వు కనిపిస్తోంది.

ప్రకాష్ చిరునవ్వుతో, "ఏమిటి, విచిత్రంగా మాట్లాడుతున్నావు?" అన్నాడు.

"బయట ఆ వర్షమూ... లోపల ఈ వెచ్చదనం అనుకుంటాను" అంది రాజేశ్వరి. ఆమె మాటల కోసం తడుముకుంటోంది.

"ఏమిటి, నువ్వడగాలనుకున్నది?"

ఆ ప్రశ్న ఆశ్చర్యం కలిగించినట్టు చూస్తూ, "మీనాక్షి ఎలాగ ఉంది?" అంది రాజేశ్వరి.

"బాగానే ఉంది."

"చూశావా?"

"తనే వొచ్చింది..."

"జెయి— అక్కడికి కూడానా?"

"అవును."

"అక్కడికి— నేను వొస్తే ఏమనుకునేవాడివి?" అర్థంలేని ప్రశ్న... అన్నట్టు, నవ్వేడు.

రాజేశ్వరి నవ్వి, "సిల్లీ. అవును... నీ బాటిల్ తెరచిపెట్టేదా." అంది బాటిల్ చేతిలోకి తీసుకుంటూ.

"వొద్దు."

"ఏం?"

"అది చూడ్డానికే— తాగడాని క్కాదు" అన్నాడు ప్రకాశ్.

పై గాలి చొరలేని ఆ గదిలో ఏదో అయస్కాంతంలాటి శక్తి క్రమంగా చుట్టుకొంటోం దనిపించింది ప్రకాశ్‌కి.

"నిజంగా?" అంది ఆశ్చర్యంగా, రాజేశ్వరి.

"అవును..."

"జీవితంలో ఇలాటివి చాలా ఉన్నాయి నీకు... ఏం?"

సీసా మాత్రం చేతిలో పెట్టుకున్నా ఈమెకి మతిపోతోంది, అనుకున్నాడు ప్రకాశ్. కొత్తగా ఏమి పగ తీర్చుకో డానికి వచ్చింది?... ఆ బాణం వేసి కాని ఈమె వెళ్లదు...

"ఏం?" మళ్లా అడిగింది రాజేశ్వరి.

"అలాగే అనుకో" అన్నాడు ప్రకాశ్.

టేబిల్‌మీద బాటిల్ పెట్టేసి, "నేనింక వెళ్తాను..." అని లేచి నిల బడింది రాజేశ్వరి.

అతనూ నిలబడి, టేక్సీకోసం చెప్పి, "ఇంతకీ నువ్వెందుకు వచ్చి నట్టు?" అన్నాడు.


తువ్వాలు తీసి మడతపెడుతూ, "ఊరికేనే నిన్ను చూద్దామని" అంది రాజేశ్వరి.

తనకే తెలీకుండా, ఓడిపోయినట్ట నిపించింది ప్రకాశ్‌కి. మళ్లీ రాజేశ్వరి తనని ప్రకాశ్ అని పిలిస్తే బాగుండును.

బట్టలు మార్చుకుని రాజేశ్వరిని తీసు కుని కిందికి వచ్చేడు ప్రకాశ్. పోర్టి కోలో టేక్సీ ఉంది.

ఆమెని కూర్చోపెడుతూ, "ఇంతకీ నువ్వొచ్చినపని అడగనే లేదు" అన్నాడు ప్రకాశ్.

టేక్సీలో కూర్చుని, "అవసరం లేక పోయిందిలే... ఆ జవాబూ తెలిసింది...



జల్లు బాగా ఉంది... లోపలికి వెళ్లు" అంది రాజేశ్వరి.

"ఇంటిదాకా రానా?" అన్నాడు ప్రకాశ్ చివరిగా ఏదో వెలితి ఫీల్ అవుతూ.

"నీ ఇష్టం" అంది రాజేశ్వరి.

అతను టేక్సీ ఎక్కి కూర్చున్నాడు. ఇంటికి చేరేదాకా ఎవరూ మాట్లాడలేదు.

రాజేశ్వరి తలుపు తీసి లోపలికి అడుగుపెట్టేసరికి ప్రకాశ్ తడిసి పోయాడు.

"నేను వెళ్లివస్తాను......రేపు సాయంత్రం" అన్నాడు.

"లోపలికి రా... వెళ్లి అక్కడ చేసేదేమిటి?" అంది రాజేశ్వరి. అతని సమాధానానికి ఆగకుండా టేక్సీతో వెళ్లిపొమ్మని చెప్పింది- డబ్బు తనే ఇచ్చి.

ప్రకాశ్ లోపలికి వెళ్లి కూర్చున్నాడు. సాయంత్రానికీ ఇప్పటికీ గదిలో ఏమిటో భేదం కనిపిస్తోంది.

రాజేశ్వరిలోనూ కనిపిస్తోంది.

ఏమిటి జరుగుతోంది?

ఒకనాటి వెన్నెలరాత్రి జ్ఞాపకం వొచ్చింది.

ఈ మధ్యాహ్నపు మాటల శూలాలూ జ్ఞాపకం వచ్చాయి.

ఇందాకా హోటల్లో...

రాజేశ్వరి మనసులో ఏముంది? హఠాత్తుగా ఎందుకు మారిపోతోంది? లేక, ఇది మరొక, తాత్కాలికమైన, నటనా?

"ఏమిటంత తీవ్రంగా ఆలోచి స్తున్నావు, ప్రకాశ్?"

రాజేశ్వరి బట్టలు మార్చుకుని, తల దువ్వుకుని, వచ్చింది.

ఆమెనించి కళ్లు తిప్పుకుని, "ఏముంది? నా జీవితం ఎలా అయిపోయిందోనని ఆలోచిస్తున్నాను" అన్నాడు.

"కమల గురించి కూడానా?"

"అవును..."

అడగకూడని ప్రశ్న అడిగినట్టు, పశ్చాత్తాపంతోలాగ, తల వంచుకుని కూర్చుంది రాజేశ్వరి.

"జ్యోతి ఆరోగ్యంగా ఉందా?" అని అడిగాడు ప్రకాశ్. ఉదయంనించీ ఈ ప్రశ్నకి అవకాశమే రాలేదు.

తల ఊపింది రాజేశ్వరి.

"నన్నెప్పుడైనా... తలుచుకుంటుందా?"

"రోజూను..."

"అమ్మని?"

"అప్పుడప్పుడు... చిన్నపిల్ల కదా! క్రమంగా మరిచిపోతుంది..."

"అవును... నేను దాన్ని జాగ్రత్తగా పెంచగలను రాజేశ్వరీ...!"

రాజేశ్వరి మాట్లాడలేదు.

"నాకొక... ఉద్యోగం కూడా ఉంది — ప్రైవేటు కంపెనీలో... మంచిది..."


"కంగ్రాట్స్..."

"కాని... రాజేశ్వరీ! వీటన్నిటి కన్నా నాకు ముఖ్యమైనది... కావాలి... జ్యోతి..."

గతుకుల బాటనించి రాజమార్గంలోకి వొచ్చినట్టు ఉంది అతనికి... కాని గమ్యం తెలీని పరిస్థితి...

"నీకు కావాలి... అందరికీ ఏదో ఒకటి కావాలి..." అంది రాజేశ్వరి.

"అవును... మీరందరూ సుఖపడాలనే నా ప్రార్థన" అన్నాడు ప్రకాశ్ సిన్సియర్‌గా.




"నాకేం కావాలో తెలుసునా?"

"చెప్పు..."

"జ్యోతి..."

తెల్లబోయి చూశాడు ప్రకాశ్.

"అవును... దానితో మరీ అలవాటైపోయింది".

"కాని..."

బయట ఒక్కసారి వర్షం వెలిసింది.

నిమిషం తరవాత అతను లేచాడు.

"ఇంక వెడతాను రాజేశ్వరీ!..." అన్నాడు నిరాశగా. కళ్లు తుడుచుకుని, తానూ లేచింది రాజేశ్వరి.

"పద... టాక్సీదాకా నేనూ వస్తాను" అంది.

"వొద్దులే... నాకు బాగుండదు... రేపు సాయంత్రం వచ్చేదా?"

ఆమె గుమ్మంలో నిలబడి ఉంది.

అతను బయట నిలబడ్డాడు ఆమె వైపు తిరిగి.

"నీ ఇష్టం... వాళ్లు రేపు ఉదయానికి వస్తారు.

"మరొకసారి ఆలోచించు... జ్యోతి మాట."

"ఆలోచించనక్కర్లేదు... నీ ఇష్టం వచ్చినప్పుడు తీసికెళ్లు!"

ప్రకాశ్ అవాక్కు అయిపోయాడు.

"రాజేశ్వరీ!... నిజంగా?"

"అవును... ఏం? నమ్మకంలేదా?"

"జరిగినదాని తరవాత... నమ్మలేకుండా ఉన్నాను."

"అవున్లే... కాని... చాలా ఆలోచించి ఆలోచించి ఓడిపోయాను... గుడ్‌నైట్!"

తలుపు వేసుకుంది రాజేశ్వరి.

ఆ తలుపు వైపు చూస్తూ కొంతసేపు నిలబడి, రోడ్డుమీదకి నడిచాడు ప్రకాశ్.

బాటమీద చాలా నీరు ఉంది.

చీకటి చీకటిగా ఉంది.

కాని, అతనివేవీ పట్టించుకోకుండా, నడవసాగాడు. క్రమంగా చీకటి పలచబడుతోంది.